క్లుప్తంగా

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

చింతల్: ఐడీపీఎల్ కాలనీలోని శ్రీ సాయిబాబా దేవాలయం 28వ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు పంచామృతాభిషేకం, 8 గంటలకు సాయిబాబా ప్రత్యేక అర్చనలు, మధ్యాహ్నం 12 గంటలకు హారతి, సాయంత్రం 6 గంటలకు సంధ్యా హారతి, 6: 45 నిమిషాలకు ప్రత్యేక కనకాభిషేకము, 7 గంటలకు సంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 8 గంటలకు పల్లకి సేవ, సాయిబాబా ఊరేగింపు, 8: 30 నిమిషాలకు అన్నదాన కార్యక్రమం, 9:30 గంటలకు శేష హారతిని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కనకాభిషేకంలో పాల్గొనే భక్తులు దేవాలయంలోని ఆలయ కమిటీని, పూజారిని సంప్రదించాలని కోరారు.

హోంగార్డ్ కుటుంబానికి రూ.11.60లక్షల చెక్కు



కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ హోంగార్డ్‌గా విధులు నిర్వర్తిస్తూ జనవరి 25న చనిపోయిన శ్రీనివాస్ కుటుంబానికి రూ.11.60 లక్షల చెక్కును శుక్రవారం సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అందజేశారు. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కండ్లకోయ జంక్షన్ వద్ద హోంగార్డ్‌గా విధులు నిర్వర్తిస్తూ శ్రీనివాస్ లారీ ప్రమాదంలో చనిపోయిన విషయం తెలిసిందే.

పంచముఖ ఆంజనేయస్వామి ప్రత్యేక పూజలు

నిజాంపేట్: నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్–2లోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం దేవతా విగ్రహాల ఓష్ట యంత్ర ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్, నిజాంపేట్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బీఆర్‌ఎస్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు ఆగం రాజు, మేకల వెంకటేశం, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, చందు, శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకుడు కొలను శ్రీనివాస్‌రెడ్డి, తలారి విరేష్ పాల్గొన్నారు.

విగ్రహాల పునః ప్రతిష్ఠ

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ 11వ డివిజన్‌లోని శ్రీనల్లపోచమ్మ ఆలయంలో దేవతా విగ్రహాల పునః ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగా వైభవంగా కొనసాగుతోంది. శుక్రవారం గణపతి హోమం, నవగ్రహ పూజ, వాస్తు పూజ, బలిహరణ తదితర పూజా కార్యక్రమాలు జరుగగా బీఆర్‌ఎస్ సీనియర్ నేత కొలన్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. మధ్యాహ్నం జరిగిన అన్నదాన కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు దారి, ఎల్లయ్య, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కల సాకారమవుతున్న వేళ



బాచుపల్లి మండలంలో జీఓ.58, 59 పథకం కింద ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తవడంతో సంతోషంగా లబ్ధిదారులు

- బాచుపల్లి మండలంలో జీఓ.58 కింద 201 మందికి పట్టాలు
- జీఓ.59కింద 601మంది దరఖాస్తులకు ఆమోదం
- తిరస్కరణకు గురైన వారికి మరో అవకాశం

నిజాంపేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓ.58, 59 పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల కలలు సాకారమవుతున్నాయి. బాచుపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు రిజిస్ట్రేషన్లు చేయడంతో పాటు స్థలాల్లో కబ్జాలో ఉన్న వారికి రెవెన్యూ అధికారులు ఇళ్ల పట్టాలు అందిస్తున్నారు. బాచుపల్లి మండల పరిధిలో జీఓ.58 కింద దరఖాస్తు చేసుకున్న 201 మందికి ఇప్పటికే పట్టాలు అందజేశారు. కొన్ని రోజులుగా జీఓ.59 కింద దరఖాస్తు చేసుకుని అన్ని ధ్రువపత్రాలు సరిగా ఉన్న వారికి రెవెన్యూ అధికారులు నగదు చెల్లింపు నోటీసులు జారీ చేసి రుసుం చెల్లించిన దరఖాస్తుదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు.

చకచకా పూర్తవుతున్న జీఓ.59 రిజిస్ట్రేషన్లు..

బాచుపల్లి మండల పరిధిలో జీఓ.59 కింద దరఖాస్తు చేసుకున్న 601 మంది దరఖాస్తులను ఆమోదించిన రెవెన్యూ అధికారులు ఇప్పటికే 318 పైచిలుకు లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేశారు. త్వరగా మిగతా వారికి సైతం రిజిస్ట్రేషన్లు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మే 30వ తేదీ చివరి గడువు..

2014 సంవత్సరం వరకు జీఓ.58, 59ల కింద మొదట అనుమతి ఇచ్చిన అధికారులు తాజాగా ప్రభుత్వం మే 30 వరకు మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు గడువును పెంచింది. దీంతో అప్పట్లో దరఖాస్తు చేసుకోలేని వారు, దరఖాస్తు చేసుకున్నా కొన్ని సాంకేతిక సమస్యలతో తిరస్కరణకు గురైన దరఖాస్తుదారులు మరోసారి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసలుబాటు దొరికింది.

సంతోషంగా ఉంది..



జీఓ.59 కింద ప్రభుత్వం తమ ఇంటిని రిజిస్ట్రేషన్ చేయడం సంతోషంగా ఉంది. ఇప్పటి వరకు తాము కొనుగోలు చేసిన ఇంటికి ఎటువంటి ఆధారాలు లేవు. ప్రభుత్వం తమ ఇంటికి రిజిస్ట్రేషన్ చేసి ఎంతో మేలు చేసింది. ఇకపై తమ ఇంటికి బ్యాంక్ రుణాలు సైతం వస్తాయని అధికారులు తెలిపారు.

– నాగమణి, బాచుపల్లి


చార్జీలు తగ్గిస్తే బాగుంటుంది..



మా బస్తీలో చాలా మంది ఇళ్లకు రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో అధికారులు ఎప్పుడైనా స్వాధీనం చేసుకుంటారేమోనన్న భయం ఉండేది. జీఓ.59 పథకంతో మా ఇంటి రిజిస్ట్రేషన్ పూర్తయ్యింది. ఇప్పుడా భయం లేదు. మా లాంటి పేదోళ్ల ఉండే బస్తీల్లో ఇళ్ల రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గిస్తే బాగుంటుంది. చాలా మంది డబ్బులు చెల్లించలేక ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం జీఓ.58, 59 ద్వారా పేదలకు ఉపకారం చేసింది.

– వీణా, సాయినగర్

అందరి రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తాం



జీఓ.58 కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇప్పటికే ఇళ్ల పట్టాలను అందజేశాం. జీఓ.59 దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసి, ప్రభుత్వం నిర్ధారించిన రుసుం చెల్లించిన వారికి రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. ఇప్పటికే సగానికి పైగా దరఖాస్తుదారులు రిజిస్ట్రేషన్ పత్రాలను పొందారు. మరో వారం రోజుల్లో మిగతా వాటిని సైతం పూర్తిచేస్తాం. రెవెన్యూ అధికారుల నుండి నోటీసులు రాని వారు మరోసారి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం దరఖాస్తు చేసుకునే గడువు పెంచిన నేపథ్యంలో కొత్త వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సురేందర్, బాచుపల్లి తహసీల్దార్

ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేస్తాం

- మేడ్చల్ జిల్లా రవాణా అధికారి కిషన్
- వాహనాల పన్నులు చెల్లించాలని వినతి



కుత్బుల్లాపూర్: వాహనాల పన్నులు చెల్లించకుండా తిరిగే వాటిపై కేసులు నమోదు చేస్తున్నామని మేడ్చల్ జిల్లా రవాణా అధికారి కిషన్ అన్నారు. ఈనెల 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మేడ్చల్ జిల్లా రవాణా పరిధిలో తిరిగే వాహనాలను ఆకస్మికంగా తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు. మూడు రోజుల్లో 150 పైగా కేసులు నమోదు చేశామని శుక్రవారం ‘సాక్షి’తో అన్నారు. ప్రతి వాహనదారుడు ట్యాక్స్ చెల్లించకుండా తిరిగి పట్టుబడితే 200 శాతం పైన వేసి పన్నులు కట్టిస్తామన్నారు. లేదా గడువు తీరిన వాటిని నేరుగా రవాణా శాఖ కార్యాలయానికి వచ్చి పన్నులు చెల్లిస్తే 50% మాత్రమే పెనాల్టీ విధిస్తామని తెలిపారు. అదే విధంగా ఈనెల 15వ తేదీ నుంచి ఫిట్నెస్ విషయంపై ప్రైవేటు స్కూలు, కళాశాల యాజమాన్యాలు డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విధివిధానాలను వెల్లడిస్తామని తెలిపారు. ఫిట్నెస్ చేయించకుండా తిరిగే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. డ్రైవర్లకు ప్రత్యేకంగా అవగాహన కల్పించి ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

యువత సాంకేతిక రంగంలో రాణించాలి

- కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- క్లౌడిల్యా ఈఆర్పీ సాఫ్ట్‌వేర్ ఆవిష్కరణ



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

కుత్బుల్లాపూర్: యువత సాంకేతిక రంగంలో రాణించి సమాజాభివృద్ధికి తోడ్పాటునందించాలని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కొంపల్లి మినర్వా గ్రాండ్‌లో బీస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉన్నత విద్యాసంస్థల్లో మెరుగైన భద్రత ఆధునిక ఫీచర్ల ఆటోమైజేషన్‌ను మెరుగుపర్చేందుకు తీసుకొచ్చిన క్లౌడిల్యా ఈఆర్పీ సాఫ్ట్‌వేర్‌ను సంస్థ అధినేత బీనా, డైరెక్టర్ మిథున్ రాజులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక రంగంలో నూతన మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. దానికి అనుగుణంగా యువత కొత్త ఆవిష్కరణలు చేయడం అభినందనీయమన్నారు. నూతన సాఫ్ట్‌వేర్ ద్వారా విద్యాసంస్థలో ఖచ్చితమైన సమాచారం అందించేందుకు, పరీక్షల నిర్వహణ, రోజువారి విద్యార్థుల పాఠ్యాంశాలు, ఇతర సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. లాభాపేక్షతో కాకుండా సామాజిక బాధ్యతతో ప్రతి సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులో తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి, వివిధ కళాశాలల చైర్మన్లు, ప్రిన్సిపాల్స్, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించని ఐస్‌క్రీం కంపెనీపై ఎస్‌ఓటీ దాడులు

- ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఐస్‌క్రీం శాంపిళ్లు
- కంపెనీ యజమానిపై కేసు నమోదు



డెలీషియస్ ఐస్‌క్రీం కంపెనీలో తయారైన ఐస్‌క్రీం



ఎక్స్‌పైరీ డేట్ ముద్రించే స్టాంపులు

జీడిమెట్ల: నాణ్యత ప్రమాణాలు పాటించని ఐస్‌క్రీం కంపెనీపై బాలానగర్ ఎస్‌ఓటీ, జీడిమెట్ల పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. సీఐ పవన్ వివరాల ప్రకారం.. ఎర్రగడ్డకు చెందిన ఎండీ ఫెరోజ్ అనే వ్యక్తి షాపూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో డెలీషియస్ ఐస్‌క్రీం పేరిట కంపెనీ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. గురువారం రాత్రి ఎస్‌వోటీ, జీడిమెట్ల పోలీసులు సంయుక్తంగా దాడి చేసి కంపెనీలో సోదాలు నిర్వహించారు. అపరిశుభ్రమైన వాతావరణంలో పలు రకాల ఐస్‌క్రీంలు తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కొన్ని ఐస్‌క్రీం శాంపిళ్లను తీసుకుని పరీక్షించేందుకు ఫుడ్‌సేఫ్టీ అధికారులకు పంపించారు. అనంతరం ఎక్స్‌పైరీ తేదీ ముద్రించే స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. డెలీషియస్ పరిశ్రమకు ఎలాంటి అనుమతులు లేవని పోలీసులు గుర్తించారు. అనంతరం సదరు కంపెనీ యజమానిపై ఐపీసీ సెక్షన్ 272కింద కేసు నమోదు చేశారు. నివాసాల మధ్య గాని ప్రజలకు తెలిసిన ప్రాంతాల్లో నకిలీ తినుబండారాలు తయారు చేసే పరిశ్రమలు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

250 అడుగుల రోడ్డును పునరుద్ధరించాలి

పంజగుట్ట: కొంతమంది నాయకులు భూ ఆక్రమణలో కొత్త విధానం కనుక్కున్నారని బీజేపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి ఆరోపించారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లో 250 అడుగుల వెడల్పు ఉన్న కొంపల్లి, దూలపల్లి, బహదూర్‌పల్లి రోడ్డును ఆరు కిలోమీటర్ల మేర 100 అడుగులకు తగ్గించి 150 అడుగులు కబ్జాచేశారని ఆయన ఆరోపించారు. ఇదే విషయమై హైకోర్టులో పిటిషన్ వేసినట్లు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలిపారు. ఈ భూమి విలువ సుమారు రూ.2వేల కోట్లకు పైనే ఉంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించి 250 అడుగుల రోడ్డును పునరుద్ధరించాలని కోరారు. ఇప్పటికే ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించినట్లు ఆయన పేర్కొన్నారు.సమావేశంలో కొంపల్లి కౌన్సిలర్ రాజిరెడ్డి, బీజేపీ నాయకులు శ్యామ్‌రావు, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ జీడిమెట్ల డిపో వద్ద ఉన్న నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, ఆలయ కమిటీ చైర్మన్ అమురి ఇంద్రసేన గుప్తా, చిత్తరమ్మ టెంపుల్ చైర్మన్ అంతయ్యగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు బాలరాజు, యాదగిరి, శ్రీరాములు, సురేష్, నరసింహారెడ్డి, మహేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి కల్యాణానికి నూతన వస్త్రాలు తెస్తూ..

సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

దుండిగల్: మారుతున్న కాలానుగుణంగా జబ్బులు వ్యాపిస్తున్నాయని.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధం వహించాలని దుండిగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ వై.నిర్మల తెలిపారు. గండిమైసమ్మలోని మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో శుక్రవారం గుండె జబ్బుల సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ నిర్మల సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుండె పోటుకు గురైన వ్యక్తికి సకాలంలో సీపీఆర్ చేస్తే బతికే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఆ సమయాన్ని గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తారని అన్నారు. సీపీఆర్ చేసే విధానాన్ని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సునంద, రెవెన్యూ అధికారి శ్రీహరి, మున్సిపల్ సిబ్బంది, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి సాయినగర్‌లో శుక్రవారం సైబరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో జాగృతి పోలీస్ కళా బృందం సభ్యులు ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టులు ధరించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్, చౌరస్తాల్లో ట్రాఫిక్ నిబంధనలు పాటించినట్లయితే ప్రమాదాలు జరిగే ఆస్కారముండదని పేర్కొన్నారు.

సింపోజియాలతో సృజనాత్మకత

ఉస్మానియా యూనివర్సిటీ: సింపోజియాలతో ఇంజినీరింగ్ విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ అన్నారు.శుక్రవారం ఈసీఈ విభాగంలో ప్రారంభమైన రెండు రోజుల జాతీయ సింపోజియానికి హాజరై సావనీర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రొ.రామకృష్ణ, డా.నవీన్, స్టూడెంట్ కోఆర్డినేటర్ రుత్విక్‌రెడ్డి, సి.అభిచందన పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ పరీక్షలను అడ్డుకుంటాం

ఉస్మానియా యూనివర్సిటీ: పాత వారిని తొలగించకుండా టీఎస్‌పీఎస్సీ పరీక్షలను నిర్వహిస్తే అడ్డుకుంటామని ఓయూ విద్యార్థులు హెచ్చరించారు. శుక్రవారం ఓయూ క్యాంపస్ నుంచి టీఎస్ జాక్, బీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్‌భవన్ ర్యాలీని పోలీసులు అడ్డుకొని విద్యార్థి నేతలను అరెస్ట్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

అల్విన్‌కాలనీ: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి గుర్తుతెలియని వ్యక్తి హల్‌చల్ చేశాడు. ఈ ఘటన కూకట్‌పల్లి సర్కిల్ ఆస్‌బెస్టాస్ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కడంతో షాక్ కొట్టి వెంటనే కింద పడిపోయాడు. పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరలో లో ఓల్టేజ్ వస్తున్న కారణంగా మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అదనంగా ఏర్పాటు చేశారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడు ఎవరూ, ఏమిటి అని ప్రశ్నించినా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అంతకు ముందు రాత్రి పాపారాయుడునగర్‌లో ఇంటి ముందు హల్‌చల్ చేయటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మతిస్థిమితం లేని వ్యక్తి అని పోలీసులు వదిలేసి వెళ్లారు. తిరిగి ఉదయం ఆస్‌బెస్టాస్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి హల్‌చల్ చేయటంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

‘లౌకికవాదం ముసుగులో హిందువులకు ద్రోహం చేస్తోంది’

- కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ బుచ్చిరెడ్డి
- కాంగ్రెస్ వాగ్దానాలకు వ్యతిరేకంగా నిరసన



కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ మతతత్వ రాజకీయాలకు పాల్పడుతోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానాల్లో ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ పిలుపు మేరకు శుక్రవారం అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో గాజులరామారం రోడ్డులో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట హనుమాన్ చాలీసా పఠనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. లౌకికవాదం ముసుగులో కాంగ్రెస్ పార్టీ హిందువులకు ద్రోహం చేస్తోందన్నారు. దీనిని ప్రజలు తిప్పి కొట్టాలని కోరారు. అనంతరం స్థానికంగా ఉన్న ప్రజలకు హనుమాన్ చాలీసా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గిలిగె శేఖర్, బావిగడ్డ రవి, డివిజన్ అధ్యక్షులు పత్తి సతీష్, సాయినాథ్ నేత, కంది శ్రీరాములు, పులి బలరామ్, డివిజన్ ఇన్‌చార్జ్‌లు కృష్ణయాదవ్, సుశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.